క్లుప్తంగా

ఎడవెల్లి సోమనాథ్‌కు దళిత రత్న అవార్డు



డిచ్‌పల్లి: ధర్మారం(బి) గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎడవెల్లి సోమనాథ్‌కు దళిత రత్న అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ బాబూజగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 2025 ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు చేతుల మీదుగా సికింద్రాబాద్ క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సోమనాథ్ దళిత రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కర్, బాబూజగ్జీవన్ రామ్ అడుగుజాడల్లో నడుస్తూ అణగారిన ప్రజలకు సేవ చేస్తూ వారి హక్కుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు.

మదరపు రాములు, రాజులకు..



నిజామాబాద్‌నాగారం: నగరానికి చెందిన మదరపు రాములు మాదిగ, మందరాజు మాదిగలకు సికింద్రాబాద్ క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో దళిత రత్న అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డుతో సత్కరించినందుకు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు, తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ లెక్కింపు



నిజామాబాద్ రూరల్: నగరంలోని జెండా బాలాజీ దేవస్థానం హుండీని ఆలయ ఈవో రవీందర్ నేతృత్వంలో మంగళవారం లెక్కించారు. హుండీలో రూ.43,003 నగదు ఉన్నట్లు వారు తెలిపారు. ఆలయ సిబ్బంది కమల, ప్రశాంత్, విష్ణు సహస్రనామ పారాయణ భక్త బృందం పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కళాశాలలకు ఎంపిక



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నర్సయ్య మంగళవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ నివాస విద్యా సంస్థల సంఘం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇంటర్లో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబర్చి కేతావత్ శివ, బట్టు సాయితేజ, కేతావత్ సిద్ధార్థలు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, లింగం, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సినీజనం మెచ్చిన సిరివెన్నెల



నిజామాబాద్ రూరల్: తెలుగు సినీపాటకు కొత్త మెరుగులు అద్ది, తనదైన శైలితో సిరివెన్నెల లొలికించిన సుప్రసిద్ధ సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి 72వ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని సీతారాంకాలనీలో గల తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య కార్యాలయంలో సిరివెన్నెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ పండితులు, అష్టావధానులు డా.గణపతి అశోక శర్మను శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. పలువురు గాయనీ గాయకులు సిరివెన్నెల పాటలు పాడి సభికులను రంజింపజేశారు. సమాఖ్య కార్యదర్శి బి.చంద్రశేఖర్, ప్రముఖ కవి, సభాసామ్రాట్ వీపీ.చందన్‌రావు తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



సిరికొండ: మండలంలోని గోప్య తండా జీపీ పరిధిలోని కాశీవాడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఇండ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు సంతోష్ నాయక్ ముగ్గు పోశారు.

కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి
- నియోజకవర్గానికి మొదటి విడతగా 3,200 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



చెక్కులను పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి

నిజామాబాద్ రూరల్/జక్రాన్‌పల్లి: మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏడు మండలాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు ఎంతో ఆసరాగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో మొత్తంగా 208 మందికి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశామన్నారు. అలాగే నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికి నియోజకవర్గంలో మొదటి విడతగా సొంత భూమి ఉన్న వారికి 3,200 ఇళ్ల మంజూరు పత్రాలను ఇచ్చామని, కొంతమంది లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి ముగ్గు పోసుకున్నారని అన్నారు. సొంత భూమి లేనివారికి రెండో విడతలో 75 గజాల భూమిని ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాల ద్వారా బస్సుల కొనుగోలు చేసి అందజేస్తామని, ఇందిరమ్మ శక్తి క్యాంటీన్‌ల ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, వివిధ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, చిన్నారెడ్డి, నవీన్ గౌడ్, రవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలి



రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్‌తో గంగపుత్ర సంఘం నేతలు

మోపాల్: జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు రూ.500 డీడీ చెల్లించి సభ్యత్వాలను రెన్యువల్ చేయించుకోవాలని రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ సూచించారు. హైదరాబాద్‌లో తన కార్యాలయంలో సాయికుమార్‌ను కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోటగిరి మండలం లింగాపూర్ మత్స్యకారుల సమస్యను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని చైర్మన్ సూచించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పథకాలను అర్హులైన వారికి వర్తింపజేసేలా నాయకులు చొరవ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌సీఎస్ చీఫ్ ప్రమోటర్ కస్ప శ్రీనివాస్, నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య, డీఎఫ్‌సీఎస్ మాజీ చైర్మన్ పల్లికొండ సాయిబాబా, ప్రమోటర్ మెట్‌పల్లి గంగాధర్, ఆలూరు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం ఆరేళ్లుగా ఎదురుచూపులు



నవీపేట: ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన దివ్యాంగుడికి ఆరేళ్లుగా పింఛన్ అందడం లేదు. మద్దెపల్లికి చెందిన రాచివార్ శ్రీనివాస్ మేస్త్రీ పని చేసేవాడు. ఆరేళ్ల క్రితం ధర్మాబాద్‌కు వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో కాలికి తీవ్ర గాయమైంది. దీంతో వైద్యులు ఎడమకాలి మోకాలి పైభాగం వరకు తొలగించారు. ఏడాది తర్వాత మళ్లీ ప్రమాదం జరగడంతో రెండో కాలిని మోకాలి పైభాగం వరకు తొలగించారు. దీంతో వీల్‌చైర్‌కు పరిమితమైన శ్రీనివాస్ గత ఆరేళ్లుగా వికలాంగ పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. మద్దెపల్లికి మంగళవారం వచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని బాధితుడు శ్రీనివాస్ భార్య, కుమార్తె, కొడుకుతో కలిసి మొర వినిపించుకున్నాడు. సాంకేతిక లోపంతో సదరం ధ్రువీకరణ పత్రంలో వయసు ముద్రణ కాకపోవడంతో ఫింఛన్ రావడం లేదని, ఫింఛన్ వచ్చేలా చేస్తామని అధికారులు ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన జేడీ



మాట్లాడుతున్న విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు మంగళవారం ప్రారంభమైన రెండో విడత శిక్షణా కేంద్రాన్ని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అకడమిక్ అంశాలు లర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించడం, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం తదితర అంశాలపై ఉపాధ్యాయులను మోటివేట్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. గణితం ఉపాధ్యాయులకు రాష్ట్ర పరిశీలకుడు ప్రభాకర్‌రావు ప్రత్యేక సెషన్‌లో వివరించారు. గణితంలో 160 మంది, సాంఘిక శాస్త్రంలో 157 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి శంకర్ తెలిపారు.

సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ లక్ష్యం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నవీపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నాయకులు

నవీపేట: నిరుపేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. నవీపేటతో పాటు మండలంలోని నాడాపూర్, జన్నేపల్లి, సిరన్‌పల్లి, నాగేపూర్, మద్దెపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు సొంతిళ్లు ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో పంపిణీ చేసిన ఇంటి స్థలాలకు నిధులు మంజూరు చేయలేదని, మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం అందించే రుణాలు సరిపోకపోతే డ్వాక్రా సంఘాలలో అదనపు రుణాలను పొందాలని సూచించారు. ఎవ్వరికీ నయా పైసా కమీషన్ ఇవ్వొద్దని సూచించారు. ఎవరైనా డబ్బుల డబ్బుల కోసం వేధిస్తే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా నాయకులు నాగేష్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, మండల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, కిషన్‌రావ్, సంజీవ్‌రెడ్డి, సాయరెడ్డి, భగవాన్, గోపాల్, గంగాధర్, విజయ్, మూస, బాబు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తన తలకు తానే కొరివి పెట్టుకొంటోంది

నిజామాబాద్‌అర్బన్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసి కాంగ్రెస్ పార్టీ తన తలకు తానే తలకొరివి పెట్టుకుంటోందని నిజామాబాద్ బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్‌రావు వ్యంగంగా విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసినందుకా నోటీసులు ఇచ్చిందని ఆయన ప్రశ్నించారు. నేడు తెలంగాణ లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలు రాష్ట్రానికి రావడానికి గత కేసీఆర్ పాలనే కారణమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,700	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	88,337	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్ ధరలు (కిలోకు)		డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
చిక్కుడుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	60	80
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	40	60

-సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 సింగిల్-1.30, 7.30 యమదొంగ-4.10, 10.30
స్క్రీన్-2 సింగిల్ 11.00,4.30,10.30
హిట్-1.30, 7.20
స్క్రీన్-3 మిషన్ ఇంపాజిబుల్-10.20,4.30, 7.30
మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్ 2డీ)-1.30, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్-10.10, 4.25, 10.40 సింగిల్-1.40, 7.55
స్క్రీన్-2 డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్- 11.15, 10.50 - లవ్లీ-(3డీ)-2.05 సింగిల్-4.35
మిషన్ ఇంపాజిబుల్ -7.20
స్క్రీన్-3 లెవన్ -11.40
యమదొంగ-1.35 - శుభ్రం- 8.05
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-10.45
స్క్రీన్ -4 ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ - 11.20, 1.50, 7.35 హిట్ -4.20, 10.05

లలితామహల్ యమదొంగ **దేవి** సింగిల్
నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్
విజయ్ హిట్

అనుమతి లేని ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేతలు

నిజామాబాద్‌అర్బన్: విద్యా శాఖ అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ స్కూళ్లపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సీబీఎస్ఈ సిలబస్ పేరుతో బిల్డింగ్ పూర్తికాక ముందే శ్రీ చైతన్య విద్యా సంస్థలు అడ్మిషన్లు చేపడుతున్నాయని, ఇతర ప్రైవేట్ స్కూల్స్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తోక పేర్లు పెట్టుకొని, రోబోటిక్స్, ఏసీ క్లాస్ రూమ్స్, రాయితీల పేరుతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేసుకుంటూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. అరికట్టాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపైన ఉందన్నారు. కఠిన చర్యలు తీసుకోకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మనోజ్, నగర సాయి కిరణ్, ప్రవేష్, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం



డిచ్‌పల్లి: వెస్లీనగర్ తండాలో గిరిజన ఆరాధ్య దైవాలైన జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం తండావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జగదాంబ, సేవాలాల్ మహరాజ్‌లకు ప్రత్యేక పూజలు, భోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేడుకల్లో మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ బి.నవీన్, తాజా మాజీ సర్పంచ్ బోడ సునీత రఘు, తండా పెద్దలు హరిలాల మీసాల హరి, హరిచంద్, మదన్‌లాల్, నాయకులు సురేష్, కిషన్, పవన్, వసంత్, అశోక్, గంగాధర్, తండావాసులు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి కలుగుతుంది



నిజామాబాద్ రూరల్: భక్తితోనే ముక్తి కలుగుతుందని ప్రముఖ ధార్మికవేత్త గోసాం దత్తు శాస్త్రి అన్నారు. మంగళవారం గీత భవనం ప్రాంగణంలో బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక పారాయణం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కలియుగంలో భగవంతుడిని ప్రసన్నం చేసుకోవడానికి భగవన్నామ స్మరణ భజనతోనే సాధ్యమన్నారు. భక్తి వికాసం పెంపొందించడానికి రామరక్ష స్తోత్రము, హనుమాన్ చాలీసా దోహదపడుతాయన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు న్యాలం శ్రీనివాస్, రమేష్ రావు, మనోహర శాస్త్రి, మన్మోహన్ శాస్త్రి, అప్పాల కిష్టయ్య, మారుతీ జోషి పాల్గొన్నారు.

సమాచారం..

నేడు డిచ్‌పల్లి ఖిల్లాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో బుధవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఈ వానాకాలం సీజన్‌లో పంటల సాగుపై అవగాహన కల్పించనున్నట్లు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి(ఏవో) శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల సాగు, యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం జారీ చేసే రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. ఇందుకోసం రైతు ఆధార్‌కార్డు, కార్డుకు లింక్ ఉన్న ఫోన్, పట్టాపాసుబుక్ జిరాక్స్‌లు తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు.

22న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ మిషన్ భగీరథ సబ్‌స్టేషన్‌లో 22న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సీజీఆర్ఎఫ్-2ను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ డిచ్‌పల్లి డివిజనల్ ఇంజినీర్ అల్లాపూర్ రమేష్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ జి.శ్రీనివాస్, ఇందల్వాయి ఏఈ పండరీనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నిజామాబాద్ సీజీఆర్ఎఫ్-2 చైర్మన్ ఎరుకల నారాయణ హాజరవుతారన్నారు. ఇందల్వాయి సెక్షన్, ఎల్లారెడ్డిపల్లి, డిచ్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, గడ్కోల్ సెక్షన్లకు చెందిన వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభం



హాజరైన ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు, ఎస్‌జీటీలు

డిచ్‌పల్లి: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు వృత్యంతర శిక్షణలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జీటీ తెలుగు, ఇంగ్లిష్, మాథ్స్, పరిసరాల విజ్ఞాన శాస్త్రం ఉపాధ్యాయులకు మంగళవారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. అలాగే మండలంలోని ధర్మారం(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 24వరకు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో బోధన పద్ధతులు మెరుగుపర్చుకోవడం, తమ సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించడం, ఆత్యాధునిక సాంకేతికత అప్‌గ్రేడ్ చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు కోర్సు డైరక్టర్లు సంధ్యానాయక్, గంగుల శ్రీనివాస్, లక్ష్మీనాథం తెలిపారు. డీఆర్‌పీలు సంతోష్, పోచన్న, రాములు, శ్రీపాద్, రాజశేఖర్, రంజిత్, సుద్దపల్లి హెచ్‌ఎం జి.నరేష్, పాల్గొన్నారు.

సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో..

సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఎంఈవో రాములు మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న విషయాలను బోధనలో అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా పాఠాలను బోధించాలని చెప్పారు. శిక్షణలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీలు పాల్గొన్నారు.



ధర్మారం(బి) జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణనిస్తున్న కోర్సు డైరెక్టర్ సంధ్యానాయక్



సుద్దపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షణనిస్తున్న కోర్సు డైరెక్టర్ నరేష్



సిరికొండలో మాట్లాడుతున్న ఎంఈవో రాములు

బాలభవన్‌లో మిమిక్రీ ప్రదర్శన



నిజామాబాద్ రూరల్: జిల్లా బాల భవన్‌లో ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మిమిక్రీ కళాకారుడు రంగనాథ్ మాట్లాడే బొమ్మతో పిల్లలను కడుపుబ్బా నవ్వించారు. నా పేరు డీజే టిల్లు, నామాలకు మీరు త్రిల్లే అనంగానే పిల్లలలో ఉత్సాహం వెల్లువిరిసింది. పిల్లల మెమోరీని పరీక్షిస్తూ ప్రశ్నలతో ఆలోచింపజేశాడు. అనంతరం చిలుకతో కూడా మాట్లాడించి పద్యాలు చెప్పించారు. కార్యక్రమంలో బాలభవన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మల్లాది ఉమాబాల, శిక్షణ తరగతుల ఇన్‌చార్జి విఠల్ ప్రభాకర్, వెంకటలక్ష్మి, లలిత, సోని, శ్రీలత, లక్ష్మణ్ తదితరులున్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం



డిచ్‌పల్లి: ఎన్నికల విధుల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాకు వచ్చి ఏడాదికిపైగా డిచ్‌పల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ప్రభాకర్ రెండు రోజుల క్రితం నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. మంగళవారం ఆయనను డిప్యూటీ తహసీల్దార్లు శ్రీకాంత్, అశ్వక్ ఆధ్వర్యంలో ఆర్ఐలు సంతోష్, ప్రభు, రెవెన్యూ సిబ్బంది శాలువా, పూలమాల, మెమోంటోతో ఘనంగా సత్కరించారు. సీనియర్ అసిస్టెంట్ షఫీయుద్దీన్, జూనియర్ అసిస్టెంట్లు సూర్య, అంజాద్, కిరణ్, శ్రీదేవి, సృజన, మోహన్, సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.